www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 07 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-121 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# భజన బృందంగా మారిన నీతి ఆయోగ్

- నేటి నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నా
- నీతి ఆయోగ్ సిఫార్సులను తుంగలో తొక్కారు
- మిషన్ కాకతీయ, భగీరథలకు పైసా ఇవ్వలేదు
- నీతి ఆయోగ్‌లో చర్చించే అవకాశం లేదు
- ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం విధానాలు
- మీడియా సమావేశంలో కేంద్రంపై నిప్పులు చెరిగిన కెసిఆర్
- మరో 10 లక్షల కొత్త పెన్షన్లు
- పంద్రాగస్టు నుంచి అమలు
- బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసి చెక్కేస్తున్నారు
- దేశంలో ఎన్‌పిఎల స్కామ్ నడుస్తోంది
- దీనిని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది
- మీడియా సమావేశంలో సిఎం కెసిఆర్
- మోడీజీ..చేతులు జోడించి వేడుకుంటున్నా
- పాలూ, చేనేత, శ్మశానాలపై జిఎస్టీ ఎత్తేయండి
- ప్రజలను బతికేలా చేయాలి తప్ప..చంపకండి
- మీ విధానాలతో దేశానికి నష్టం వస్తోంది
- రాష్ట్రాల ప్రగతిని దెబ్బతీసేలా కేంద్రం చర్యలు
- రాజ్యాంగ సంస్థలను దెబ్బతీస్తే ..మిమ్ములనే మింగేస్తాయి
- నెహ్రూ నాటి సంస్కారం లేకుండా పోయింది
- నీతి ఆయోగ్‌లో పల్లీలు తినేందుకు రావాలా
- రాజకీయంగా కేంద్రంతో పోరాటం తప్పదన్న కెసిఆర్
- సిఎం కెసిఆర్ కీలక ప్రకటన




**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం):** ఆదివారం ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు సీఎం కేసీఆర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ ద్వారా తన నిరసన తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. నీతి ఆయోగ్ లక్ష్యాలను దెబ్బతీసి దానిని భజన బృందంగా తయారు చేయడమే గాకుండా, దానికి ఓ స్వయంప్రతిపత్తి లేకుండా, అభిప్రాయాలకు అవకాశం లేకుండా చేసినందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రగతిభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. మిషన్ భగీరథకు రూ.19,500 కోట్లు గ్రాంట్, మిషన్ కాకతీయకు రూ. 5 వేల కోట్లు గ్రాండ్ ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసిందన్నారు. అయితే నీతి ఆయోగ్ సిఫార్సులను కేంద్ర పట్టించుకోలేదని సీఎం కేసీఆర్ విమర్శించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పూర్తయినా నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిధుల

2వ

## నేడు బాసరకు గవర్నర్ తమిళిసై

**ట్రిపుల్ ఐటిని సందర్శించనున్న గవర్నర్**



**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం):** గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం బాసర వెళ్లనున్నారు. బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడనున్నారు. రైలు మార్గాన వెళ్లనున్న గవర్నర్ తెల్లవారుజామున 2:50గంటలకు బాసర రైల్వే స్టేషన్ కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 4 గంటలకల్లా బాసర ట్రిపుల్ ఐటీకి చేరుకుంటారు. 6.15గంటల వరకు ట్రిపుల్ ఐటీ గెస్ట్ హౌస్ లో విశ్రాంతి తీసుకున్న అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఉదయం 7 గంటలకు తిరిగి ట్రిపుల్ ఐటీకి చేరుకోనున్న గవర్నర్ తమిళిసై విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేయనున్నారు. అనంతరం ఉదయం 8గంటల నుంచి 10 వరకు అక్కడ విద్యార్థులతో సమావేశం అవుతారు. 10గంటలకు ట్రిపుల్ ఐటీ నుంచి బయలుదేరి నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీకి రోడ్డు మార్గంలో చేరుకుంటారు. వర్సిటీ విద్యార్థులు, సిబ్బందితో గవర్నర్ ముచ్చటించ నున్నారు. లంచ్ అనంతరం మధ్యాహ్నం 2.20 గంటలకు నిజామాబాద్ రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. అక్కడి నుంచి రైలు మార్గంలో సాయంత్రం 5.40గంటలకు హైదరాబాద్ రానున్నారు.

# కోమటిరెడ్డికి సోకాజులేవి ?

## కోమటిరెడ్డి బ్రదర్స్ విచిత్ర వైఖరిని ప్రశ్నించినందుకు అద్దంకి దయాకర్‌కు సోకాజు నోటీసు

### తెలంగాణలో కామన్‌గా వాడే పదం వాడాను : అద్దంకి

- టీపీసీసీ రేవంత్‌పై కోమటిరెడ్డి అనుచ్చిత వ్యాఖ్యలు
- సభ రోజే అమిత్‌షాను కలవడం దేనికి సంకేతం
- అద్దంకి మాటలను సమర్ధిస్తున్న మునుగోడు కాంగ్రెస్ కార్యకర్తలు
- రేవంత్‌పై అనుచిత వ్యాక్యలు చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సోకాజు నోటీసులు ఏవి?
- వారంలోగా అద్దంకి వివరణ ఇవ్వాలని కోరిన క్రమశిక్షణా కమిటీ

**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం):** శుక్రవారం జరిగిన చండూరు సభలో అద్దంకి దయాకర్ వ్యాఖ్యలు కాంగ్రెస్‌పార్టీలో పెను దుమారాన్ని రేపాయి. సభలో దయాకర్ మాట్లాడుతూ ఓ వైపు తన నియోజకవర్గంలో కాంగ్రెస్ సభ జరుగుతుంటే... కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీలో అమిత్ షాను కలవటమేంటని అన్నారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విషయంలో తన వైఖరేమిటో చెప్పాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని అద్దంకి దయాకర్ డిమాండ్ చేసిన విషయం విదితమే. ఆ సందర్భంగా ఉంటే ఉండు, పోతే పో అనే విధంగా పరుష పదజాలంతో విమర్శించారు. దీంతో కోమటిరెడ్డి వర్గీయుల్లో ఆగ్రహం, అసంతృప్తి చెలరేగాయి. అనంతరం కోమటిరెడ్డిపై వ్యాఖ్యలను నిరసిస్తూ కోమటిరెడ్డి అనుచరులు అద్దంకి దయాకర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తల నుండి అద్దంకి దయాకర్‌కు మద్దతు లభిస్తుంది. అద్దంకి దయాకర్ మాటలను కార్యకర్తలు సమర్ధిస్తున్నారు. గత కొన్ని రోజులుగా టి.పీసీసీ రేవంత్‌ను తీవ్ర విమర్శలు చేస్తుండటం, సభకు వెంకట్‌రెడ్డి గైర్హాజరు కావడం, తమ్ముడి కోసం పార్టీకి దూరంగా ఉంటూ పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించడం, సభ జరిగే రోజే అమిత్‌షాను కలవడం ఇవన్నీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీని విడుస్తున్నాడనే సంకేతాలు వెలుబడడంతో అనుమానాలు బలపడుతున్నాయి. ఈ నేపధ్యంలోనే అద్దంకి నోటి నుంచి పరుష పదాలు రావచ్చు అని అభిప్రాయం ప్రజల నుండి వెలుబడుతుంది. సభలోఅన్న ఒక్క మాటతో దయాకర్‌కు వెంటనే సోకాజు నోటీసులు ఇస్తున్నారు మరి సోనియా నియమించిన టీపీసీసీ రేవంత్‌ను విమర్శిస్తుంటే వెంకట్‌రెడ్డికి సోకాజు నోటీసులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో బలిసినోడికి ఓ న్యాయం, బక్కోడికో న్యాయమా అని, కాంగ్రెస్ వైఖరి పట్ల తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నా వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా : అద్దంకి దయాకర్



మునుగోడు సభలో కోమటిరెడ్డిపై అభ్యంతకర వ్యాఖ్యలపై అద్దంకి దయాకర్ స్పందించారు. పార్టీకి నష్టం జరగొద్దనే ఆ వ్యాఖ్యలు చేశాను తప్పు... వెంకట్ రెడ్డిని విమర్శించాలని కాదన్నారు. తెలంగాణలో ఆ పదాన్ని కామన్‌గా వాడుతారన్న ఆయన... తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కాగ... అంతకు ముందు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరుతూ అద్దంకి దయాకర్ కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనుచరులు అద్దంకి దయాకర్ పై చర్యలు తీసుకోవాలంటూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన క్రమశిక్షణ కమిటీ వారంలోగా అద్దంకి దయాకర్ వివరణ ఇవ్వాలని ఆదేశించింది

## రాజగోపాల్ రెడ్డి, కెఏ పాల్ ఇద్దరూ ఒకటే

**మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఎద్దేవా**



**హైదరాబాద్, అగస్ట్ 6 (సమ సమాజం):** ఏపీలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, తెలంగాణలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇద్దరూ ఇద్దరేనని, ఏం మాట్లాడతారో వాళ్ళకే తెలియదని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోమటిరెడ్డి బ్రదర్స్‌పై మండిపడ్డారు. కోమటిరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ఎన్నో అవకాశాలు కల్పించిందని గుర్తుచేశారు. కేంద్రమంత్రి అమిత్‌షాను ఇద్దరు ఒకేసారి కలిశారంటే త్వరలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బీజేపీలో చేరుతారని తెలిపారు. ఎంపీ కోమటిరెడ్డి చండూరు సభకు ఎందుకు హాజరు కాలేదో, అమిత్‌షాతో ఎందుకు భేటీ అయ్యారో చెప్పాలని రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీకి పనిచేశారని కాంగ్రెస్ నేత మల్లు రవి దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని తెలిపారు. ముందస్తు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని మల్లు రవి ప్రకటించారు.

## 120 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిన బిజెపి

**ఉప ఎన్నికతో ఎదగాలని చూస్తోంది: పొన్నం**



**సిద్దిపేట, ఆగస్ట్ 6 (సమ సమాజం):** హుస్నాబాద్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాలు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ముఖాముఖి ద్వారా కలిసి ధైర్యం నింపడం కోసమే 9వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఈ పాదయాత్ర చేపడుతున్నానని తెలిపారు. అందరి ఆశీస్సులతో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా వస్తుందన్నారు. 120 సీట్లలో కనీసం డిపాజిట్లు రాని బీజేపీ ఉప ఎన్నికల ద్వారా అవి వివేకంతో రాష్ట్రంలో ఎదగాలని చూస్తుందని విమర్శించారు.

## ఘట్కేసర్ మండల ఎంపిటిసిల నిరసన

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**మహాత్మగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేత**

2

## కాంట్రాక్టులు ఇచ్చి చేర్చుకునే సంస్కృతి కాదు

**రేవంత్‌కు కౌంటర్ ఇచ్చిన బండి**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (సమ సమాజం):** ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు బీజేపీ నేత బండి సంజయ్ కౌంటరిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డబ్బు, కాంట్రాక్టులిచ్చి చేర్చుకునే సంస్కృతి బీజేపీది కాదని చెప్పారు. డబ్బు, కాంట్రాక్టులిచ్చి చేర్చుకునే సంస్కృతి బీజేపీది కాదని సంజయ్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన రాజ్‌గోపాల్, దాసోజు ఎందుకు పార్టీ మారుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ నేత సోనియాను తిట్టినవారే ఇప్పుడు పీసీసీ చీఫ్ అయ్యారని, కేసీఆర్ భాషను ప్రజలు అసహ్యించుకుంటున్నారని సంజయ్ తెలిపారు. త్వరలో బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నీచుడు, దుర్మార్గుడు, కమీనే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

2వ

# చేనేతపై జీఎస్టీ అనాలోచిత నిర్ణయం

- టెక్స్‌టైల్ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రం
- అన్నిరంగాల మాదరిగానే దీనిని దెబ్బతీసారు
- చేనేత, జౌళి రంగాల సమస్యలను పరిష్కరించండి
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు కెటిఆర్ లేఖ



**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం):** చేనేతపై జీఎస్టీ అనాలోచిత నిర్ణయమని మంత్రికెటిఆర్ కేంద్రాన్ని తప్పుబట్టారు. మోదీ సర్కార్ నేతన్నల కడుపుకొడుతోందని మండిపడ్డారు. ఈ మేరకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు మంత్రి కేటీఆర్ లేఖ రాశారు. టెక్స్‌టైల్, చేనేత రంగాలపై కేంద్రం నిరాసక్తత చూపుతోందని తప్పుబట్టారు. జౌళి రంగానికి, చేనేత కార్మికులకు బీజేపీ సర్కార్ పైసా సాయం చేయలేదని విమర్శించారు. చేనేత, జౌళి రంగాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రకటనలు కాదు.. పథకాలు రావాలి.. మాటలు కాదు-నిధుల మూటలు ఇవ్వండని కేటీఆర్ కోరారు. దేశంలోనే అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు కేంద్ర సాయం ఎక్కడని ప్రశ్నించారు. చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని, టెక్స్‌టైల్‌పై జీఎస్టీ తగ్గించాలన్నారు. చేనేత, జౌళి

2వ

## ప్రొఫెసర్ జయశంకర్‌కు కెసిఆర్ నివాళి



**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం):** ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని సిఎం కెసిఆర్, మంత్రలు ఘనంగగా నివాళి అర్పించారు. శనివారం ప్రగతి భవన్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు..తదితరులు పాల్గొన్నారు. చిత్రపటం వద్ద హరీష్ రావు, మల్లారెడ్డి తదితరులునివాళి అర్పించారు.

## సంపాదకీయం

# పాలకుల తీరును ఎండగట్టాల్సిందే !

ఆజాదీకా అమృత్ మహోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్న వేళ..మన నేతలంతా తిరంగా జెండా పట్ల గౌరవం చాటాలని పిలుపునిస్తున్నారు. ఊరూవాడా ఉత్సవాలు చేయబోతున్నారు. నిజంగా దేశభక్తి విషయంలో ఏ ఒక్కరినీ అనుమానించడానికి లేదు. ఈ గడ్డమీద పుట్టిన ప్రతి ఒక్కరూ నిరంతరం దేశానికి సలాం చేస్తూనే ఉన్నారు. దేశంపట్ల నిరంతర భక్తితోనే ఉంటున్నారు. కానీ లేనిదల్లా పాలకులు,రాజకీయ పార్టీల వారే. వారు చిత్తశుద్ధితో పాలన చేయకపోవడం వల్లనే భరతమాత నిరంతరం కన్నీళ్లు పెట్టుకుం టోంది. దీనిపై మనపాలకులు ఆలోచనచేయాలి. పాలకుల కోసం ప్రజలు ఎందుకు త్యాగం చేయాలి. ఎందుకు ఓటేసి నెత్తిన కూర్చోపెట్టుకోవాలి. ఎందుకు వారి సౌఖ్యాల కోసం ప్రజలు బలి కావాలి. ఇప్పుడు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేళ ప్రజలంతా మన ప్రజాస్వామ్యం సక్రమంగా మనుగడ సాగిస్తున్నదా లేదా అన్న ఆలోచన చేయాలి. ఓట్లను అమ్ముకోవడంతో వారు మన నెత్తిన కూర్చుంటున్నారు. అధికారం దక్కగానే వారు తీసుకునే నిర్ణయాలకు మనమెందుకు బలి కావాలి. వారు విసరే తాయిలాలకు లొంగి మనమెందుకు బాధలు భరించాలి. ఇవన్నీ ప్రజలుగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఓటేసే ముందు..వేసిన తరవాతా నేతల తీరు గురించి ఆలోచించాలి. వారి కుట్రలకు ప్రజలు బలిపశువులు కాకూడదు. 75 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా ఇంకా ప్రజలు అనేక రకాల కష్టనష్టాలు భరిస్తున్నారు. పాలకుల మాత్రం సర్వసుఖాలు అనుభవిస్తున్నారు. అందుకే ఈ శుభసందర్భంలో ప్రజలు చర్చ చేయాలి. ఇదే సందర్భంలో రెండు అంశాల్లో కీలక నిర్ణయాలు దేశానికి దిక్సూచిగా నిలిచాయి. ఒకటి ఉచిత పథకాల విషయంలో సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇక రెండోది చట్టసభలకు ఎన్నికైన వారెవరైనా క్రిమినల్ లేదా ఇతర కేసుల్లో మినహాయింపు పొందడం కుదరదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి చర్యలు అప్పుడప్పుడు మన ప్రజాస్వామ్యం బలంగగా నిలవడానికి ఉపయోగ పడుతున్నాయి. ఇక వివరాల్లోకి వెళితే.. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచిత పథకాల పంపిణీ హామీలివ్వడం తీవ్ర ఆర్థిక అంశమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ హామీల నియంత్రణకు అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు అవసరమని అభిప్రాయపడింది. ఇందులో నీతి ఆయోగ్, ఆర్థిక సంఘం, లా కమిషన్, ఆర్బీఐతో పాటు పాలక, ప్రతిపక్షాలు, ఇతర భాగస్వాములు కూడా సభ్యులుగా ఉండాలని పేర్కొంది. రాజకీయపార్టీల ఉచిత హామీలను ఏ విధంగా నియంత్రించాలో ఈ కమిటీ నిర్మాణాత్మక సూచనలు చేయాలని కోరింది. ఈ కమిటీ కూర్పుపై కేంద్రం, ఎన్నికల కమిషన్ తన అభిప్రాయాలను వారంరోజుల్లో తెలియజేయాలని చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గత బుధవారం ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల్లో లబ్ది కోసం, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు వివక్షాపూరితంగా హామీలిస్తున్నాయని..హేతుబద్ధత లేని ఉచిత పథకాలను ప్రకటిస్తున్నా యని.. వీటిని కట్టడి చేయాలని కోరుతూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది తీవ్ర వ్యవహారమని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనిపై తన వైఖరిని స్పష్టం చేయాలని కేంద్రాన్ని కూడా ఆదేశించింది. ఈ సందర్భంగా పై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటును ధర్మాసనం ప్రస్తావించింది. అయితే ఈ వ్యవహారంపై పార్లమెంటు చర్చించాలని సీనియర్ న్యాయవాది కపి సిబల్ సూచించారు. దీనికి జస్టిస్ రమణ స్పందిస్తూ.. 'ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరుగుతుందని మీరు భావిస్తున్నారా? ఏ రాజకీయ పార్టీ చర్చిస్తుంది..? ఏ పార్టీ కూడా ఉచితాలను వ్యతిరేకించదు. ఈ రోజుల్లో అందరికీ ఉచితాలు కావాలి. ఫలానా పార్టీ అని పేరు చెప్పను. అన్ని పార్టీలూ వీటి నుంచి లబ్ది పొందుతున్నాయని పేర్కొనడం ద్వారా దేశంలో ప్రస్తుత పరిస్థితులు నిర్మొహమాటంగా బయటపెట్టారు. ఏదైనా ఉచిత పథకం హామీ ఇస్తున్నారంటే.. దానికి ఎక్కడి నుంచి డబ్బు తెస్తారో పార్టీలు చెప్పాల్సి ఉంటుంది. ఉచితాలను నియంత్రించకుంటే దేశానికి ఆర్థిక విపత్తు సంభవిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో ఉచితాలకు సంబంధించిన మార్గదర్శకాలను చేర్చాలని సుప్రీంకోర్టు గతంలోనూ ఓ సందర్భంలో తీర్పు ఇచ్చింది. దీనిని ఇసి మాత్రమే కట్టడిచేయాలన్న అభిప్రాయం వ్యక్తం అయ్యింది. అయితే సుప్రీం ఆదేశాలను పాటించాల్సింది కూడా పాలకులకే కనుక..వారూ ఓ రాజకీయ పార్టీకి చెందిన వారే కనుక ఇది అంత తేలిక గా సాధ్యం కాకపోవచ్చు. అయితే ప్రజలు మాత్రం దీనిపై ఖచ్చింతంగా చర్చించాలి. ఇకపోతే పార్లమెంట్ సభ్యులకు కేంద్ర దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేయవచ్చని, అరెస్ట్‌లు చేయవచ్చని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాజ్యసభలోనే స్పష్టం చేశారు. క్రిమినల్ కేసుల్లో వారు సైతం సామాన్య ప్రజలతో సమానమేనని, ఎంపీ పదవితో వారికి ఎలాంటి రక్షణ ఉండదని వెల్లడించారు. పార్లమెంటు సభ్యులు తమ పార్లమెంటరీ విధులను అడ్డంకులు లేకుండా నిర్వహించేందుకు వీలుగా కొన్ని ప్రత్యేకాధికారాలను అనుభవిస్తారు. కానీ, క్రిమినల్ కేసుల్లో ఎంపీలకు, సామాన్య ప్రజలకు ఎలాంటి బేధాలు ఉండవని ఉప రాష్ట్రపతి వెంకయ్య స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల వేళ తనకు ఈడీ సమన్లు జారీ చేయటంపై కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించిన మరుసటి రోజే వెంకయ్య నాయుడు ఈ వ్యాఖ్యలు చేయటం ప్రాధాన్యం సంతరించుకుంది. సివిల్ కేసుల్లో పార్లమెంట్ సభ్యులకు ఉన్న ప్రత్యేక అధికారాలను రాజ్యసభ ఛైర్మన్ వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి 40 రోజుల ముందు, తర్వాత సివిల్ కేసుల్లో అరెస్ట్ చేయలేరని పేర్కొన్నారు. అయితే, క్రిమినల్ కేసుల్లో ఎలాంటి రక్షణ ఉండదని స్పష్టం చేశారు. చట్టాన్ని, లీగల్ ప్రక్రియను గౌరవించటం చట్టసభ్యుల బాధ్యత అని కూడా సూచించారు. పార్లమెంట్ సమావేశాలతో సంబంధం లేకుండా.. దర్యాప్తు సంస్థల విచారణకు హాజరు కావాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు సూచించారు. మొత్తంగా ఈరెండు విషయాల్లో మనమంతా చర్చ చేయాలి. ఒకటి ఉచిత పథకాలతో ఖజానా గుల్లవుతోంది. అభివృద్ధి కుంటుపడుతోంది. మరోటి ప్రజాప్రతినిధులు కేసులకు అతీతమన్న భావనలో ఉన్నారు. ఈ రెండు విషయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు నిలదీయకుంటే మన ప్రజాస్వామ్యానికి విలువ లేదు. నిరంతరం మనమే జాగరూకులుగా ఉంటూ పాలకులను నిలదీయడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కాగలదు.

పృథ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# తరుణ్‌చుగ్‌తో దాసోజు శ్రవణ్ భేటీ

- బండి సంజయ్‌తో కలసి వెళ్ళిన దాసోజు
- తెలంగాణలో కెసిఆర్‌కు రోజులు దగ్గర పడ్డాయన్న చుగ్

డబ్బులిచ్చి నేతలను ఆహ్వానించే సంస్కృతి కాదన్న బండి



న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (సమ సమాజం): కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన సీనియర్ నేత దాసోజు శ్రవణ్ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ తరుణ్ చుగ్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలిసి చుగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శ్రవణ్‌కు శాలువా కప్పి సత్కరించారు. శ్రవణ్ తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన చుగ్ బీజేపీ విద్యార్థి పరిషత్ తో పనిచేసిన శ్రవణ్‌తో చాలాకాలం తర్వాత భేటీ కావడం సంతోషం కలిగించిందని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుంటోందని తరుణ్ చుగ్ ఆరోపించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఢిల్లీ వచ్చిన బండి సంజయ్ తో పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఆయన నాయకత్వంలో ప్రజాసంగ్రామ యాత్ర మోటార్ సైకిల్ యాత్రలు దిగ్విజయంగా నడుస్తున్నాయని చుగ్ ప్రశంసించారు. ప్రజల ఆశలను టీఆర్ఎస్ సర్కారు వమ్ము చేసిందని, ఆ పార్టీకి త్వరలోనే జనం గుడ్ బై చెప్పనున్నారని చెప్పారు. కేసీఆర్ ఇంటలిజెన్స్ కూడా ఇదే మాట చెబుతోందని అన్నారు. ప్రస్తుతం చూస్తున్నది ట్రైలర్ మాత్రమేనని, త్వరలోనే బీజేపీలో భారీ సంఖ్యలో చేరికలు ఉంటాయని చుగ్ స్పష్టం చేశారు. చేరికల తేదీ త్వరలోనే ఖరారు చేస్తామని తరుణ్‌చుగ్ ప్రకటించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోతోందని, తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం దోచుకుంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ కేసీఆర్‌కు బీటీమ్‌గా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో బీజేపీలో మరిన్ని చేరికలుంటాయని తరుణ్‌చుగ్ తెలిపారు. నేతలకు డబ్బులిచ్చి పార్టీలో చేర్చుకునే సంస్కృతి బీజేపీది కాదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన రాజ్ గోపాల్ రెడ్డి, శ్రవణ్‌లు ఎందుకు పార్టీ మారుతున్నారో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. గతంలో సోనియాను తిట్టిన వాళ్లు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షులయ్యారని బండి విమర్శించారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు మాట్లాడుతున్న భాష చూసి జనం అసహ్యించు కుంటున్నారని అన్నారు. శ్రవణ్ చేరిక ఎప్పుడన్నది సాయంత్రం ప్రకటిస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే ఈ నెల 21న తనతో పాటు చాలా మంది ఉద్యమ నేపథ్యం ఉన్న వారందరూ బీజేపీలో చేరుతారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమ్ముడు పోయానని నిరూపిస్తే దేనికైనా సిద్ధం.. నిరూపిస్తావా? అని ప్రశ్నించారు. 13 ఏళ్లలో ఒక్క కేసు కూడా తనపై లేదన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై 120 కేసులు ఏమైనా తెలంగాణ ఉద్యమంలో పెట్టారా? అని రాజగోపాల్‌రెడ్డి నిలదీశారు.రేవంత్ రెడ్డి భాష సరిగా లేదు. నేను వెంకట్ రెడ్డి కలిసే ఉన్నాం. తెలంగాణలో కోమటిరెడ్డి బ్రదర్స్ కలిసే ఉన్నారనే కదా అందరూ అభిమానించేది. కాంగ్రెస్‌కు టీఆర్ఎస్‌ను ఓడించే శక్తి లేదన్నారు. నా రాజీనామా నాకోసం కాదు.. తెలంగాణ, మునుగోడు ప్రజల కోసం స్పీకర్‌ని 8వ తేదీన కలుస్తాను. రాజీనామా ఆమోదం చేయించుకుంటానని అన్నారు.

## ఎమ్మెల్యే జీవన్ రెడ్డి హత్యకు కుట్ర, కుట్ర కేసులో భార్యాభర్తలను చేర్చిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం): ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి హత్యాయత్నం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు మూడు రోజులుగా నిందితుడు ప్రసాద్‌ను విచారిస్తున్నారు. ఎమ్మెల్యేను చంపడానికే వచ్చినట్లు పోలీసుల నిర్ధారించారు. హత్య కుట్రలో వాడిన కత్తిని రూ. 1800కు నాందేడ్‌లో, యూపీలో రూ.32 వేలకు తుపాకీని కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ప్రసాద్ బుల్లెట్ల కోసం బీహార్ వెళ్లాడని, అవి లభించకపోవడంతో బొమ్మ తుపాకీ కొనుగోలు చేశాడని పోలీసులు తెలిపారు. అయితే ఎమ్మెల్యే హత్యాయత్నం కుట్ర వెనక నిందితుడికి పెద్ద వ్యక్తులు సహకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసులో నిందితుడు ప్రసాద్ భార్య మాజీ సర్పంచ్ లావణ్యను ఎ2 గా పోలీసులు చేర్చారు.

## భజన బృందంగా మారిన నీతి ఆయోగ్

(మొదటి పేజి తరువాయి) కేటాయింపు విషయంలో గందరగోళం ఉందని, ఉద్దేశ్యపూర్వకంగా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. మోదీకి రాసిన లేఖలో కేంద్ర విధానాలపై కేసీఆర్ నిప్పులు చెరిగారు. కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇటీవల రాష్ట్రాలు చేసే అప్పులపై కేంద్ర కొత్త నిబంధన తీసుకొచ్చిందన్న కేసీఆర్.. ఈ కొత్త నిబంధనలతో అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రానికి బ్రేక్ పడుతుందని అన్నారు.. నీతి ఆయోగ్ అనేది నిరర్థక సంస్థగా మారిపోయిందని విమర్శించారు. రాష్ట్రాలు అభివృద్ధి అయితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. కేంద్రానివి అన్నీ ఏకపక్ష నిర్ణయాలు. దేశం సంక్లిష్ట పరిస్థితిలో ఉంది. రూపాయి విలువ పడిపోయింది. నిరుద్యోగం పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. ఇలాంటి ముఖ్య అంశాలపై నీతి ఆయోగ్‌లో చర్చించడం లేదు. ఢిల్లీలో కూడా నీళ్లు దొరకడం లేదు. నీతి ఆయోగ్ ఏం చేసింది. కోట్లాది మంది ప్రజలపై ప్రభావం చూపే అంశాలపై చర్చ జరగడం లేదు. కేంద్రం నిస్తేజంగా చూస్తూ ఉండిపోతుంది. దేశంలో మత సామరస్యం దెబ్బతినేలా కొందరు నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. అయినా కేంద్రం ఇలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సమాఖ్య స్ఫూర్తిగా విరుద్ధంగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటుంది. దేశంలో రోజురోజుకు పరిస్థితులు దిగజారిపోతున్నాయి. కేంద్ర విధానాలతో దేశంలో రైతాంగం బాగా దెబ్బతింది. రైతుల పెట్టుబడి డబుల్ అయ్యింది. సంపాదన డబుల్ అవ్వలేదు. దేశంలో ద్వేషం, అసహనం పెరిగిపోతున్నాయి.' అని సీఎం కేసీఆర్ కేంద్రం, నీతి ఆయోగ్‌పై నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్య దేశంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గతంలో ప్లానింగ్ కమిషన్ వల్ల దేశం అభివృద్ధి చెందిందన్న ఆయన... అలాంటి ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్ తెచ్చారని అన్నారు. ప్రస్తుతం ఆ సంస్థ నిరర్థక సంస్థగా, ప్రధాని భజన మండలిగా మారిందని కేసీఆర్ విమర్శించారు. అప్పట్లో మంచి చెప్తే వినే ప్రధానులు ఉండేవారని ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని అన్నారు. ఈ సందర్భంగా పంచవర్ష ప్రణాళికలు, నెహ్రూ అనుసరించిన విధానాలను ఆయన ప్రస్తావించారు. దేశంలో ఎప్పుడు లేనటు వంటి పరిస్థితులు నెలకొన్నాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్వేషాన్ని అసహనాన్ని దేశ చరిత్రలోనే ఎప్పుడు లేనట్టుగా 13 నెలల పాటు రాజధానిలో ఆందోళన చేసి 800 మంది ప్రాణాలు కోల్పోతే.. ప్రధాని మోడీ క్షమాపణ చెప్పి చట్టాలు వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. రైతుల పెట్టుబడి రెట్టింపు అయిందే తప్ప ఆదాయం డబుల్ కాలేదని విమర్శించారు. తెలంగాణలో తప్ప ఏ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగా లేదన్న విషయాన్ని కేసీఆర్ ప్రస్తావించారు. ఇక దేశ రాజధానిలో మంచి నీటి కటకట ఉందంటే నీతి ఆయోగ్ ఏం చేస్తోందని కేసీఆర్ ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీలు సైతం జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టే పరిస్థితి తలెత్తిందని, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఒకవైపు నిరుద్యోగం పెరిగిపోతుండగా.. మరోవైపు రూపాయి విలువ పాతాళానికి పడిపోతోందని ఇలాంటి పరిస్థితుల్లో నీతి ఆయోగ్ ఏం మార్పు తెచ్చిందని నిలదీశారు. విదీఏశీ మారక నిల్వలు దారుణంగా పడిపోతున్నాయని అన్నారు. కేంద్ర వైఖరి కారణంగా అంతర్జాతీయ విపణిలో భారత్ ఇజ్జత్ పోతోందని చెప్పారు. మీడియా సమావేశంలో పలువురు మంత్రులు కూడా పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో వ్యాఖ్యల కలకలం

- అద్దంకి దయాకర్ వ్యాఖ్యలపై సీనియర్ల ఆగ్రహం
- రాజగోపాల్ రెడ్డిది శల్య సారథ్యమన్న మల్లు రవి



హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం): రాష్ట్ర కాంగ్రెస్‌లో కల్లోలం కొనసాగుతూనే ఉంది. ఓ వైపు.. కొంత మంది నాయకులు పార్టీ వీడుతుంటే.. మరికొంత మంది వారిపై ఘాటు కామెంట్లు చేయటం ఇప్పుడు కాంగ్రెస్‌లో కాక రేపుతోంది. తాజాగా.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యల పట్ల పార్టీలోని సీనియర్లు తప్పుబడుతున్నారు. కోమటిరెడ్డిపై అద్దంకి దయాకర్ వ్యాఖ్యల పట్ల సీనియర్ల అసహనం.. వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఉంటూ భాజపాకు అనుకూలంగా పనిచేశారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై పీసీసీ సీనియర్ నేత మల్లు రవి ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ.. శల్యసారథ్యం చేసి పార్టీని చంపాలని చూశారని మండిపడ్డారు. రాజగోపాల్ రెడ్డిని మునుగోడు ప్రజలు రాజకీయంగా బొందపెడతారని మల్లు రవి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిపై దాసోజు శ్రవణ్ చేసిన ఆరోపణలను సైతం మల్లు రవి తీవ్రంగా ఖండించారు. దాసోజు శ్రవణ్ పార్టీ మారడం తొందరపాటు నిర్ణయంగా పేర్కొన్న మల్లు రవి.. రాబోయే ఎన్నికల్లో భాజపాకు కనీసం డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలు తొందరపాటు చర్యగా పేర్కొన్నారు. 'భాజపా, తెరాసతో సామాజిక న్యాయం సాధ్యం కాదు. కేవలం కాంగ్రెస్‌తోనే అధి సాధ్యం. రాష్ట్రంలో తెరాస, కాంగ్రెస్‌కు మాత్రమే ప్రధాన పోటీ ఉంటుంది. ముందస్తు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు మేం సిద్దంగా ఉన్నాం. అసెంబ్లీని రద్దు చేయాలా..? వద్దా..? అనేది కేసీఆర్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేస్తే ఉపఎన్నికలు వస్తాయని తమ పరిశీలనలో ఉందని మల్లు రవి అన్నారు.

# టిఆర్ఎస్ భవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి అర్పించిన హోంమంత్రి



హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం): చిన్నతనం నుంచి తెలంగాణరాష్ట్రం ఏర్పడాలని ఆకాంక్షించిన వ్యక్తి జయశంకర్ సార్ అని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణపై అనేక అంశాల్లో సీఎంకేసీఆర్ కు ప్రొఫెసర్ జయశంకర్ సలహాలు ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలకు అవగాహన కల్పించిన వ్యక్తి అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జయశంకర్‌సార్ జయంతిని నిర్వ హించారు. ఈ సందర్భంగా జయశంకర్ విగ్ర హానికి హోంమంత్రి మహమూద్ అలీ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, లక్ష్మారెడ్డి, మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కార్పొరేషన్ ఛైర్మన్లు రాజీవ్ సాగర్, గ్జజెల నగేష్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన కృషిని అందరూ గుర్తించేలా జయశంకర్ పేరిట సీఎం కేసీఆర్ జిల్లాను ఏర్పాటు చేశారని తెలిపారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణం గా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరుబాట చూపిన సిద్ధాంతకర్త జయశంకర్ సార్ అన్నారు. తెలంగాణ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ కోసం చివరి క్షణం వరకు పోరాడిన వ్యక్తి జయశంకర్ అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణలో నక్సల్స్ పేరిట అనేక మందిని గతంలో చంపిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని నీళ్లు, నిధులు, నియామకాలపైన గళమెత్తారని వినోద్ కుమార్ తెలిపారు. జయశంకర్ కేసీఆర్ తో కలిసి రాష్ట్రం కోసం పోరాడారని, ఉద్యమకారుల పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడంతో తెలంగాణ సిద్ధించిందని వినోద్ కుమార్ వివరించారు.

# ఘట్కేసర్ మండల ఎంపిటిసిల నిరసన

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

మహాత్మగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేత

మేడ్చల్, ఆగస్ట్ 6 (సమ సమాజం): ఘట్కేసర్ మండలంలోని ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు గాను, 9 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరిలో అధికార పార్టీకి చెందిన ఏనుగు సుదర్శన్ రెడ్డి ఔషపూర్ కు ఎంపీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ రోజు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేశారు. నిధులు లేని ఎంపీటీసీ వ్యవస్థను వెంటనె రద్దు చేయాలి అని అన్నారు. మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ కుండకు పెద్ద చిల్లు

- పార్టీ మనుగడకు ఇక కష్టమే
- ఆదినుంచీ రేవంత్ నాయకత్వంపై అసంతృప్తే
- పోయే నేతలను ఆపే శక్తి లేని రేవంత్
- బిజెపికి కలసి వస్తున్న రేవంత్ వ్యవహారం



హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం): టిడిపి నుంచి కాంగ్రెస్‌లో చేరి ఏకంగా పిసిసి పదవినే పొందిన రేవంత్ రెడ్డి తీరుపై కాంగ్రెస్‌లో తిరుగుబాటు మొదలయ్యింది. ముందునుంచీ కాంగ్రెస్‌లో వేళ్లూనుకుని పోయిన కాంగ్రెస్ నేతలు ఎవ్వరు కూడా రేవంత్ నాయకత్వాన్ని అంగీకరించడం లేదని ఆయన పదవి పొందిన నాటి నుంచే స్పష్టమయ్యింది. రేవంత్ నియామకాన్ని బాహాటంగానే విమర్శించారు. ఏదో సర్దుకుంటుందుని అనుకుంటున్న సమయంలో అసలుకే ఎసరు వచ్చింది. నివురు గప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి బాంబులా విస్ఫోటనం చెందుతుందని ఎవరు కూడా ఊహించి ఉండరు. రేంవత్ రెడ్డి ఒంటెద్దు పోకడలు, అహంకారంపై ఇప్పుడు తిరుగబాటు మొదలయ్యింది. అదే ఇప్పుడు బిజెపిక ఇకలిసి వస్తోంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఎక్కువ. అయితే విమర్శలు సర్దుకుంటాయని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడది కాంగ్రెస్ పునాదులనే పెకిలించేలా కనిపిస్తోంది. రెండు రోజుల తేడాలో ఇద్దరు సీనియర్ నేతలు బయటకు రావడం చూస్తుంటే కాంగ్రెస్ తెలంగాణలో బట్టకట్టడం ఇక కుదరదని అనిపిస్తోంది. ఈ ఇద్దరు మరో ఇరవై మంది అయినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఒక్కసారి చిల్లు పడ్డాకపూడ్చడం కష్టం. ఇప్పటికే జగ్గారెడ్డి బహిరంగ తిరుగుబాటు చేశారు. ఇప్పుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దాసోజు శ్రవణ్ బయటకు వచ్చారు. వారిదారిలోనే వెంకట్ రెడ్డి కూడా పోతాడని అంటున్నారు. సీనియర్ నేతలు ఎవ్వరు కూడా రేవంత్ నాయకత్వంపై పనిచేయడానికి ఇష్టం గానూ,సిద్దంగానూ లేరు. మొత్తంగా ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గతం కన్నా హీనంగా తయారవు తుందనడంలో సందేహంలేదు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఇక వరుస షాక్‌లు తప్పవని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రకటించి రెండు రోజులు గడవకముందే , ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడమే ఇందుకు సాక్ష్యం. ఈక్రమంలో జగ్గారెడ్డి, వెంకట్ రెడ్డి సహా మరికొందరు నేతలు క్యూ కట్టే అవకాశాలు ఉన్నాయి. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ కాంగ్రెస్‌లో అరాచక పరిస్థితులు నెలకొన్నాయని, బానిస బతుకు బతకడం ఇష్టంలేకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు దాసోజు శ్రవణ్ వెల్లడించారు. తెలంగాణ కాంగ్రెస్‌లో మాఫియా తరహా రాజకీయాలు చేస్తున్నారని శ్రవణ్ ప్రకటించినా..గతంలోనే అనేకులు పరోక్షంగా ఈ వ్యాఖ్యలుచేశారు. విహెచ్,జానారెడ్డి, ఉత్తమ్కుమార్ రెడ్డి,పొన్నాల,శ్రీదర్ బాబు,పొన్నం ప్రభాకర్ తదతరులు ఎవకవరు కూడా రేవంత్ నాయకత్వంలో పనిచేయడానికి సిద్దంగా లేరు. రేవంత్‌రెడ్డి పార్టీ కోసం పనిచేస్తున్నట్లు కనిపించడం లేదన్న విమర్శలు ఒక్క దాసోజు నుంచి వచ్చినవిగా చూడరాదు. ఈ క్రమంలో పార్టీ అధికారంలోకి వస్తుందని అనుకోవడం పక్కనపెడితే...కాంగ్రెస్‌లో గట్టిగా నిలబడే నేతలు ఉండకపోవచ్చు. కాంగ్రెస్‌ను రేవంత్‌రెడ్డి ప్రైవేట్ పాపర్టీగా మార్చారన్న ఆరోపణలు ఆయననిరంకుశాన్ని తెలియచేస్తున్నాయి. గత కొంతకాలంగా పీసీసీ చీఫ్ రేవంత్ వైఖరి పట్ల అనేకులుఅసంతృప్తిగా ఉన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. హస్తం పార్టీలో అరాచక పరిస్థితులు కొనసాగుతున్నాయని అంటున్నారు. అలాగే కాంగ్రెస్‌ను ఫ్రాంచైజీగా నడుపుతున్నారని మండిపడ్డారు. తనకు తిరుగు లేదన్న రీతిలో రేవంత్ వ్యవహార శైలి ఉందన్న విమర్శలు పెరిగాయి. రేవంత్ పీసీసీ చీఫ్ అయ్యాక కాంగ్రెస్‌లో కులం, ధనం అన్నట్టుగా మారిపోయిందని అన్నారు. రాహుల్ ఆలోచనకు వ్యతిరేకంగా రేవంత్ కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టిస్తు న్నాడని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. రేవంత్ కాంగ్రెస్ పార్టీలో తన సొంత ముఠాను ప్రోత్స హిస్తున్నరని దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఆరోపించారు. ఆయన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకునేందుకు పార్టీని బలహీన పరుస్తున్నారన్నారు. పార్టీలో ఎవరినీ లెక్కచేయకుండా నిరంకుశంతో వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఏఐసీసీ నుంచి ఫ్రాంచైజీ తెచ్చు కున్నట్టు రేవంత్ వ్యవహరిస్తున్నరని తెలిపారు. అయితే ఈ విమర్శలు ఒక్క దాసోజువిగానే చూడరాదు. ఇది రేవంత్‌ను వ్యతిరేకిస్తున్న వారి అభిప్రాయాలుగా చూడాలి. కెసిఆర్‌ను తిట్టినట్లుగా రాజగోపాల్‌రెడ్డిని తిట్టడం ద్వారా రేవంత్ మరింతగా పలుచనై పోయారు. ఈ క్రమంలో కాంగ్రెస్ తెలంగాణలో మనుగడ సాగించడం కష్టం.

# చేనేతపై జీఎస్టీ అనాలోచిత నిర్ణయం

(మొదటి పేజి తరువాయి) రంగాల సమస్యలపై పార్లమెంట్‌లో నిలదీస్తామని కేటీఆర్ ప్రకటించారు. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తోన్న టెక్స్ టైల్ రంగాన్ని మోడీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో టెక్స్ టైల్, చేనేత రంగాలకు ప్రోత్సాహం కల్పించాలని కేటీఆర్ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు రాపసిని లేఖలో కోరారు. టెక్స్ టైల్, చేనేత రంగాలకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. శుష్క వాగ్దానాలు,రిక్త హస్తాలు అన్నట్టుగా వ్యవహరిస్తున్న మోడీ సర్కార్... తెలంగాణ నేతన్నల కడుపు కొడుతోందని మండిపడ్డారు. తెలంగాణ టెక్స్ టైల్ రంగానికి సాయం చేశామంటూ ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులు చెప్పేవన్నీ అబద్దాలన్నారు. రాష్ట్ర టెక్స్ టైల్, చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం నయా పైసా అదనపు సాయం చేయలేదని లేఖలో కేటీఆర్ ఆరోపించారు. నిధులు, నియామకాలు, నీళ్లతో పాటు నేతన్నల బాగు కోసం ఉద్యమించిన తాము... అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిది సంవత్సరాల నుంచి టెక్స్ టైల్ రంగాన్ని ఆదుకోవాలని వివిధ రూపాల్లో కేంద్రాన్ని కోరామన్నారు. దేశంలోని ఎన్నో రంగాలను చేసినట్టుగానే టెక్స్ టైల్, చేనేత రంగాలను మోడీ నిర్వీర్యం చేశారన్నారు. అందుకే చేనేతపైన జీఎస్టీ వంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. దేశంలోనే అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, సిరిసిల్లలో మెగా పవర్లూమ్ క్లస్టర్ ఏర్పాటు ఎటు పోయాయని ప్రశ్నించారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కుకు ఆర్థిక సాయం చేయాలని ఎన్నిసార్లు కోరినా... కేంద్రం పట్టించుకోవడంలేదన్నారు. కానీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో కాకతీయ టెక్స్ టైల్ పార్కులో ప్రపంచ టెక్స్ టైల్ దిగ్గజాల్లో ఒకటైన యంగ్ వన్ కంపెనీ పెట్టుబడులు పెట్టిన సంగతిని కేటీఆర్ గుర్తుచేశారు. ఇంతటి జాతీయ ప్రాధాన్యత కలిగిన టెక్స్ టైల్ మెగా పార్క్ కి కేంద్రం సహకారం అందించాలని కోరారు. హైదరాబాద్ నగరంలో నేషనల్ టెక్స్ టైల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ తో పాటు హ్యాండ్లూమ్ ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరితే కేంద్రం నుంచి స్పందన లేదన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో 15 బ్లాక్ లెవెల్ హ్యాండ్లూమ్ క్లస్టర్ లను ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తి చేశారు. చేనేత పైన జిఎస్టీ రద్దు చేయాలి, టెక్స్ టైల్స్ పైన జీఎస్టీ తగ్గించాలని డిమాండ్ చేశారు. దేశంలోని చేనేత కార్మికులపై కేంద్రానికి ప్రేమ ఉంటే ఈ అగస్టు 7తేదిన జరిగే జాతీయ చేనేత దినోత్సవం నాటికి టెక్స్ టైల్స్, చేనేత రంగంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళి

పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు శ్రద్ధాంజలి ● జయశంకర్‌తో అనుభవాలను గుర్తు చేసుకున్ననేతలు ● సార్‌తో ఉన్న ఫోటోను ట్వీట్ చేసిన కెటిఆర్





**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా టీఆర్ఎస్ నేతలు ఆయనకు గనంగా నివాళి అర్పించారు. మంత్రులు,ఎమ్మెల్యేలు జయశంకర్ సార్‌తో తమకున్న సాన్నిహిత్యాన్ని గగుర్తు చేసుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా నివాళులర్పించారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణ శ్వాసగా.. తెలంగాణెళి ధ్యాసగా జయశంకర్ సార్ నడిపిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మీరు గడిపిన జీవితం మహోన్నతం.. స్వరాష్ట్రంలో తెలంగాణ సాగిస్తున్న ప్రగతి ప్రస్థానం సాక్షిగా.. మీకివే మా నివాళులు.. జోహార్ జయశంకర్ సార్ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. జయశంకర్ సార్‌తో దిగిన కొన్ని ఫోటోల్లో ఇది నా ఫేవరెట్ పిక్ అని తెలుపుతూ కేటీఆర్ మరో ట్వీట్ చేశారు. 2009, నవంబర్ 29న అలుగనూరు వద్ద కేసీఆర్‌ను అరెస్టు చేసిన అనంతరం.. జయశంకర్ సార్, నేను నేరుగా హనుమకొండలోని ఆయన ఇంటికి చేరుకున్నాం. ఆ తర్వాత రోజు ప్రొఫెసర్‌ను అరెస్టు చేసి ఖమ్మం జైలుకు, నన్ను వరంగల్ జైలుకు తరలించారు అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరుబాట చూపిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నివాళులర్పించారు. మీరు చూపిన మార్గం, ఉద్యమ పాఠాలు, చైతన్యం.. యావత్తు తెలంగాణ సమాజం గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటారని పేర్కొన్నారు. సార్ ఆశించినట్లుగా స్వయం పాలన సాకారమై, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు జయశంకర్ సార్ మార్గదర్శిగా తోడ్పాటు అందించి సిద్ధాంత కర్తగా చరిత్రలో నిలిచిపోయారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ జయశంకర్ సార్ ఆకాంక్షలను, ఆశయాలను అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. జయశంకర్ సార్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసు కోవాలని మంత్రి సూచిం చారు. జయశంకర్ సార్ జయంతి, వర్ధంతిలను ఘన ంగా నిర్వహించడం, ఆయన సేవలను స్మరించుకోవడం ఆయనకు మనమిచ్చే ఘనమై న నివాళి అని పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్ జయ ంతి సందర్భంగా రాజేంద్ర నగర్ లోని టీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆవరణలో జయ శంకర్ సార్ చిత్రపటానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రొఫెసర్‌గా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సిద్ధాంత కర్తగా ప్రజల్లో చెరగని ముద్ర వేసిన మహోన్నతుడు కొత్తపల్లి జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. 1952 లో జయశంకర్ సార్ నాన్ ముల్కీ ఉద్యమంలో, తర్వాత ఇడ్లీ, సాంబార్ గోబ్యాక్ ఉద్యమంలో, ఆ తర్వాత 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక రాష్ట్ర సాధనకు వెన్నుదన్నుగా నిలిచారు. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన మేధావి కొత్తపల్లి జయశంకర్ అని మంత్రి గుర్తు చేసుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను గల్లీ నుంచి ఢిల్లీ దాకా వ్యాప్తి చేయడంలో వారి పాత్ర మరవలేనిది అని దయాకర్ రావు స్పష్టం చేశారు.ప్రొఫెసర్ జయశంకర్ సార్ 88వ జయంతి సందర్భంగా నిర్మల్ పట్టణంలో జయశంకర్ విగ్రహానికి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించుకుంటూ, తెలంగాణ భావజాల వ్యాప్తికి జయశంకర్ తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. జయశంకర్ సార్ తెలంగాణ సమాజానికి ఎన్నటికీ స్ఫూర్తి ప్రదాతగానే నిలుస్తారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసుకొని ప్రతీ ఏటా ఆయన జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో నీళ్లు.. నిధులు.. నియామకాలు అనే తెలంగాణ ఆకాంక్షలు నెరవేరాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి రెడ్డి, కలెక్టర్ ముష్రఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్ బొర్కడే, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్ పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షులు మారుగోండ రాము, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిదులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసిన ప్రముఖులు







ప్రధాని మోడీ, సోనియా, మన్మోహన్ ఓటు

ఓటింగ్‌కు దూరంగగా ఉన్న టిఎంసి







**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (సమ సమాజం):** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పలువురు ప్రముఖులు ఓటు వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ, మాజీప్రధాని మన్మోమన్ సింగ్, అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు, ఆప్ నేత హర్భజన్ సింగ్, బీజేపీ ఎంపీ హేమ మాలిని పార్లమెంట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, శశి థరూర్, జైరాం రమేష్, మల్లికార్జున్ ఖర్గే, అధిర్ రంజన్ చౌధరి, కే సురేష్ ఓటు వేశారు. ఇక ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా జగదీప్ ధన్‌కర్, విపక్షాల అభ్యర్థిగా మార్గరేట్ అల్వాలు పోటీపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనున్నది. 780 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. దీంట్లో 543 మంది లోక్‌సభ, 245 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. అయితే 36 మంది తృణమూల్ ఎంపీలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. రాజ్యసభలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయి. దీంతో 744 మంది ఎంపీలు ఓటు వేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర సమితితో పాటు జార్ఖండ్ ముక్తి మోర్చా, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన ఉద్ధవ్ పార్టీలు మార్గరేట్ అల్వాకు మద్దతు ప్రకటించాయి. పార్లమెంట్ హౌజ్‌లో శనివారం ఉదయం ఉప రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ జగదీప్ ధన్‌కర్ ఎన్డీయే అభ్యర్థిగానూ, కాంగ్రెస్ సీనియర్ నేత మార్గరెట్ అల్వా ప్రతిపక్షాల అభ్యర్థిగానూ పోటీ చేస్తున్నారు. అయితే ప్రతిపక్షాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో ఎన్డీయే అభ్యర్థికే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మార్గరెట్ అల్వా (80) కాంగ్రెస్ సీనియర్ నేత, గతంలో రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. జగదీప్ ధన్‌కర్ జాట్ నేత, సోషలిస్టు భావజాలం కలిగిన వ్యక్తి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఓటింగ్‌కు గైర్హాజరవాలని నిర్ణయించుకుంది. మార్గరెట్ అల్వాను ఎంపిక చేసేటపుడు తమను సంప్రదించలేదని ఆరోపించింది. ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ ఎన్డీయే అభ్యర్థికి మద్దతిస్తోంది. మార్గరెట్ అల్వాకు దాదాపు 200 ఓట్లు (26 శాతం) లభించే అవకాశం ఉంది. ఆమెకు కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఎన్సీపీ, సమాజ్‌వాదీ పార్టీ, టిఆర్ఎస్, వామపక్షాలు మద్దతిస్తున్నాయి. పోలింగ్ పూర్తయిన తర్వాత ఫలితాలను వెల్లడిస్తారు. ఇదిలావుండగా, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు వేసే విధానాన్ని వివరిస్తూ బీజేపీ శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీల ఎంపీలు దీనిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కొందరు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ, మరో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బీజేపీ నిర్వహించిన మాక్ ఓటింగ్ డ్రిల్ అనంతరం ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి జగదీప్ ధన్‌కర్ పార్లమెంటుకు వచ్చారు. తనకు మద్దతిస్తున్నందుకు ఎన్డీయే ఎంపీలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణను జాప్యం చేస్తున్న బీజేపీ

**త్వరలో 100 డప్పులు 1000 చెప్పులతో శవ యాత్ర చేస్తాం : కురుపాటి సుదర్శన్**

- ఎస్సీ వర్గీకరణను జాప్య చేస్తున్న బీజేపీ ప్రభుత్వం
- ఉపఎన్నికల బరిలో మాదిగ జేఏసి
- త్వరలో పిడమర్తి నాయకత్వంలో కార్యచరణలు

**నల్లగొండ, ఆగస్ట్ 6 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికల్లో మాదిగల దమ్ము కేంద్ర ప్రభుత్వానికి రుచి చూపిస్తామని, కేంద్రంలో అధికారంలోకి బిజేపి వస్తే 100రోజులల్లో వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టి ఆమోదం తెలుపుతామని చెప్పిన బిజేపి నేటికి 8సంవత్సరాలు గడుస్తున్నా ఆమోదం తెలుపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజేపికి అనుకూలంగా ఉండే బిల్లులను ఆమోదిస్తూ, ప్రజలకు అవసరం లేని బిల్లు ఆమోదం తెలుపుకున్నారు. కానీ మాదిగలు 30 సంవత్సరాలుగా నిర్విరామంగా ఉద్యమాలు చేస్తూ, బలిదానాలు చేస్తున్నా కూడా బిజేపికి మాదిగల పట్లా కనికరం కనికరం చూపడం లేదు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కురుపాటీ సుదర్శన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగల ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపితే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. అంతే కాకుండా త్రిసభ్యకమిటికి చైర్మన్‌గా ఆనాటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, నాటి ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ డా.పిడమర్తి రవిని ప్రభుత్వం తరపున ఢిల్లీకి పంపిస్తే దేశ ప్రధాని నరేంద్రమోదీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం సోచనీయం. ఏండ్లకేండ్లు వర్గీకరణ అంశం జాప్యం జరుగుతున్న నేపద్యంలో వీలైనంత త్వరలో వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని, లేని పక్షంలో మునుగోడు ఉపఎన్నికల బరిలో మాదిగ జేఏసీ తరపున కురుపాటి సుదర్శన్ పోటీలో ఉండి, కేంద్ర ప్రభుత్వానికి మాదిగల వైఖరి ఏమిటో చూపిస్తామని, త్వరలో మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.పిడమర్తి రవి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యచరణ రూపొందిస్తామని, మునుగోడు ఉపఎన్నికలు జరుగబోతున్న నేపథ్యంలో రకరకాల శైలిలో నిరసనలు తెలిపి మాదిగల సత్తా బిజేపి కేంద్ర ప్రభుత్వంకి చూపిస్తామని హెచ్చరించారు.



# పారిశుధ్య కార్మికుల ధర్నా

**హైదరాబాద్, ఆగస్ట్ 6 (సమ సమాజం):** చందానగర్ మున్సిపల్ కార్యాలయం ముందు చెత్తను తరలించే ఆటోలతో పారిశుధ్య కార్మికుల ధర్నా చేశారు. చేత్తను తరలించే ఆటోలను దీప్తిశ్రీ నగర్ కాలనీ లోపలి నుంచి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చెత్తను తరలించే ఆటోలను డంపింగ్ యార్డుకు వెళ్లనీయకుండా కాలనీ వాసులు అడ్డుకుని తీవ్రంగా దుర్భాషలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అయితే కార్లను అడ్డుపెట్టి కార్మికులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గం మరొకటి లేదని ..ఇలాంటి పరిస్థితుల్లో తాము ఏం చేయాలో అర్థం కావడం లేదన్నారు. చేత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి కాలనీ వాసులు చూపిన రోడ్డు మార్గం గుంతల మయంగా ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. గుంతల మయంగా మారిన రోడ్డు మార్గం గుండా వెళ్తే ఆటోలు డ్యామేజీ అవుతాయని..రిపేర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. దీప్తిశ్రీ నగర్ కాలనీ వాసులతో అధికారులు మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాల్పుల ఘటనపై విచారణ వేగవంతం

**కేసు దర్యాప్తులో నలుగురి అనుమానితుల అరెస్ట్**

**నల్లగొండ, ఆగస్ట్ 6 (సమ సమాజం):** నల్లగొండ జిల్లా మునుగోడు మండలం సింగారం-ఊకొండి శివారులో గురువారం రాత్రి కలకలం రేపిన కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. బాధితుడు లింగస్వామికి నార్కట్‌పల్లి కామినేని వైద్యవిద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితుడిని, అతడి కుటుంబ సభ్యులను నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి విచారించారు. కేసులో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. వివాహేతర సంబంధమే కాల్పుల ఘటనకు దారి తీసి ఉండవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లింగస్వామి కుటుంబ నేపథ్యం, వ్యాపార లా వాదేవీలు, సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. లింగస్వామిని హతమార్చేందుకు పక్కా పథకం ప్రకారమే కాల్పులు జరిపినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడే ఈ ఘటనకు సూత్రధారి అని ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల్లో కేసును ఛేదిస్తామని అధికారులు ధీమాగా ఉన్నారు. బాధితుడి శరీరం నుంచి రెండు తూటాలను వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది.

# పార్టీ మారే స్వేచ్ఛ అందరికీ ఉంది

- వ్యాపారాల కోసమే అయితే టిఆర్ఎస్‌లో చేరేవాడిని
- కెసిఆర్ కుటుంబ పాలన అంతానికే బిజెపిలో చేరుతున్నా
- అవినీతి పాలన అంతమొందించడం బిజెపికే సాధ్యం
- జెపి నడ్డాతో భేటీ అనంతరం రాజగోపాల్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (సమ సమాజం):** రాష్ట్రంలో అవినీతి కుటుంబ పాలన పోవాలంటే బీజేపీతోనే సాధ్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో కెసిఆర్ కుటుంబ పాలనపై పోరాడేందుకే తాను కాంగ్రెస్‌ను వీడాల్సి వచ్చిందని మరోమారు ఆయన స్పష్టం చేశారు. శనివారం ఆయన ఢిల్లీలో వివేక్ బీజేపీ నేత వివేక్ వెంకటస్వామితో కలిసి జెపి నడ్డాను కలిశారు. ఈ నెల 21న అధికారంగా బీజేపీలో చేరుతున్నట్లు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రకటించారు. శనివారం ఆయన ఢిల్లీలో బీజేపీ చీఫ్ నడ్డాతో పాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తరుణ్‌చుగ్‌లను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మునుగోడులో బహిరంగసభ ఉండే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాటం చేశానన్నారు. ఉప ఎన్నిక అంటేనే రోడ్లు వేయిస్తున్నారని తెలిపారు. టిఆర్ఎస్ పార్టీలోకి గతంలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్లారని.. ఆ రోజు కాంగ్రెస్ నాయకులు ఏం మాట్లడలేదన్నారు. మార్టీ మారే స్వేచ్ఛ అందరికీ ఉందన్న రాజగోపాల్ రెడ్డి.. నైతికంగా రాజీనామ చేసి పార్టీ మారాను .. ఇది తప్పా? అన్నారు. మునుగోడు ఉప ఎన్నికను తెరపైకి తెచ్చింది టీఆర్ఎస్ పార్టీయే అని చెప్పారు. సీఎం కేసీఆర్ ఏనాడూ అపాయింట్ మెంట్ ఇవ్వరన్న ఆయన.. మంత్రులు కూడా అపాయింట్ మెంట్ ఇవ్వరు.. ప్రజా సమస్యలు వినరు అని తెలిపారు. ఎమ్మెల్యే చేయాల్సిన పనులు కూడా చేయనివ్వలేదని.. ప్రొటోకాల్ ఎక్కడా ఫాలో అవ్వలేదన్నారు. చౌటుప్పల్ లో సమావేశం ఏ తరహాల్ పెట్టాలో నిర్ణయిస్తామని.. మూడున్నరేళ్లుగా ప్రజా సమస్యలపై ఎలా పోరాటం చేశానో ప్రజలు చూశారని చెప్పారు. అమిత్ షాను కలవగానే గట్టుపల్లిని మండలంగా మార్చారని.. వ్యాపారాలు, కాంట్రాక్టులు, డబ్బులే ముఖ్యమంటే టీఆర్ఎస్ లోనే చేరేవాళ్లమని తేల్చి చెప్పారు. టీఆర్ఎస్ లో చేరాలని గతంలోనే ఆహ్వానం అందిందని.. కానీ ఆ పార్టీ అంటే నాకు ఇష్టం లేదన్నారు. తెలంగాణ కోసం వెంకట్ రెడ్డి మంత్రి పదవి త్యాగం చేశారని .. వెంకట్ రెడ్డి గురించి అద్దంకి దయాకర్ దారుణంగా మాట్లాడారన్నారు. తెలంగాణ కోసం పోరాడిన వారిని గాలికొదిలేశారన్న రాజగోపాల్ రెడ్డి.. రేవంత్ రెడ్డి రాష్ట్ర సాధనలో జైలుకి వెళ్లారా.. ఓటుకు నోటు కేసులో వెళ్లారా అనేది ప్రజలందరికీ తెలుసన్నారు. నాపై ఒక్క కేసు కూడా లేదని.. మమ్మల్ని కోమటిరెడ్డి బ్రదర్స్ గానే గుర్తిస్తారని.. మమ్మల్ని వాడుకుని సీఎం అవ్వాలన్న రేవంత్ ప్లాన్ పారలేదని తెలిపారు. రేవంత్ .. ఆయన సైన్యం దొంగల ముఠాగా మారి మాపై నిందలు వేస్తున్నారని తెలిపారు. ఇది ధర్మయుద్ధం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఎన్నిక అని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. రేవంత్ వచ్చాక కాంగ్రెస్ మరింత పతనమయ్యిదని చెప్పారు. మొత్తంగా నల్లగొండ రాజకీయ నేతలు కోమటిరెడ్డి బ్రదర్స్ ఢిల్లీలో తెలంగాణ రాజకీయాలను వేడి పుట్టించారు. శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కోమటిరెడ్డి బ్రదర్స్ భేటీ అయ్యారు. అయితే విడివిడిగానే.. ముందుగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. అమిత్ షాను కలిశారు. బీజేపీలో చేరిక, మునుగోడు బహిరంగ సభపై చర్చించినట్లు తెలుస్తోంది. అధికారికంగా మునుగోడు సభలోనే చేరతారనే సంకేతాలు అందుతున్నాయి. ఈ మేరకు భేటీ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ నెల 21న అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. వెంటనే శనివారం నడ్డాతో భేటీ అయ్యారు. తనతో పాటు బీజేపీలో చాలామంది చేరుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉపఎన్నిక వస్తేనే నిధులు వచ్చే పరిస్థితి ఉందని.. కేసీఆర్‌కు కనువిప్పు కలిగేలా మునుగోడు తీర్పు ఉంటుందన్నారు. అభివృద్ధికి అధికార పార్టీ సహకరించడం లేదన్న ఆయన..అభివృద్ధి సిద్ధిపేట, సిరిసిల్లలకే పరిమితమైందని ఆరోపించారు. తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రైతు రుణమాఫీని అటకెక్కించారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నిక తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు తెస్తుందని..మునుగోడు ప్రజలు ధర్మం వైపు ఉంటారన్న నమ్మకం తనకు ఉందన్నారు. అలాగే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా త్వరలోనే మంచి నిర్ణయం తీసుకుంటారని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చెరుకు సుధాకర్ చేరిక పట్ల వెంకట్ రెడ్డి అసతృప్తితో ఉన్నట్లు చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన వాళ్లకు తగిన గుర్తింపు లేదని..తమకు పదవులు ముఖ్యం కాదని..ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధానమన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ పేరు ప్రతిష్ఠలను చూసి కొందరు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. బయటనుంచి వచ్చిన వ్యక్తికి పీసీసీ చీఫ్ పదవి కట్టబెట్టారని..ఆయనను ముఖ్యమంత్రి చేయడానికి మేము కష్టపడాలా అని ప్రశ్నించారు. తాను బీజేపీకి అమ్ముడుపోయినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. కాంగ్రెస్, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలోకి వెళ్తున్నా.. ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరిస్తున్నా.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీ మారడం మోసం చేయడమా? మునుగోడు అభివృద్ధికి సొంత నిధులు ఖర్చు చేశా. నా రాజీనామాతోనైనా ముఖ్యమంత్రి కళ్లు తెరవాలి. మునుగోడులో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాజగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌పై చిల్లర గ్యాంగ్‌లు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాయి. దుర్మార్గుడి చేతుల్లోకి కాంగ్రెస్ వెళ్లింది. రేవంత్, ఆయన సైన్యం దొంగల ముఠాగా ఏర్పడింది.కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఎలాంటి అవినీతి లేదు. రేవంత్ స్వార్థం కోసం, పదవుల కోసం కాంగ్రెస్‌లో చేరాడు. డబ్బులు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్న చరిత్ర రేవంత్‌దని రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు.




# చలన చిత్రం




# బింబిసారతో కళ్యాణ్‌రామ్‌కు బ్రేక్

ఏడేళ్ళ కిందట వచ్చిన 'పటాస్' చిత్రం కళ్యాణ్ రామ్ కెరీర్‌లోనే బి÷-గగెస్ట్ హిట్. కమర్షియల్‌గా ఈ చిత్రం కళ్యాణ్‌రామ్ మార్కెట్‌ను పెంచింది. ఇక ఈ చిత్రం తర్వాత ఇప్పటివరకు ఆ స్థాయిలో మరో హిట్ పడలేదు. మధ్యలో '118' చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందినా, కమర్షియల్‌గా సక్సెస్ కాలేకపోయింది. దాంతో కళ్యాణ్‌రామ్ ఏడేళ్ళుగా కమర్షియల్ హిట్ కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో అత్యంత భారీ బడ్జెట్‌తో 'బింబిసారా' చిత్రాన్ని తనే స్వయంగా నటించి నిర్మించాడు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం పాజీటీవ్ రివ్యూలను తెచ్చుకుని ఘన విజయం సాధించింది. మల్లిడి వశిష్ఠ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్ళను సాధిస్తుంది. అంతేకాకుండా కళ్యాణ్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్‌ను రాబట్టిన సినిమాగా బింబిసారా నిలిచింది

# విలన్లను కమెడియన్లుగా మార్చుకోండి

## విమర్శకులకు కంగనా హితోక్తులు

బాలీవుడ్ బ్యూటీ క్వీన్ కంగనా రనౌత్ తన మాటలతో కాంట్రవర్సీ క్వీన్‌గా పేరు తెచ్చుకుంది. ఏ అంశమైన తనదైనా శైలీలో సూటిగా సుత్తి లేకుండా మాట్లాడుతూ వివాదానికి తెరలేపుతుంది. ఈ క్రమంలో ఆమె నెగిటివి, ట్రోల్స్‌ను ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో తనని విమర్శించే వారిని ఉద్దేశిస్తూ గతంలో కంగనా ఆసక్తికరవ్యాఖ్యలు చేసింది. ఇందుకు సంబంధించిన పోస్ట్‌ను తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిది. ఈ సందర్భంగా మీ జీవితంలోని విలన్లను కామెడీయన్‌లుగా మార్చుకోండని సూచించింది. 'వైఫల్యాలు, అవమానాలు, కించపరించిన సంఘటనలు వంటి అన్‌ఫెయిర్ థింగ్స్‌ను ఉపయోగించి ఎమోషనల్ డ్రామా ప్లే చేయడం నాకు నచ్చదు. మన కలలను నేరవేర్చుకునేందుకు అలాంటి అనుభవాలను ఇంధనంలా మార్చుకోవాలనుకోవడం సరైన పద్ధతి కాదు. మీ ఓటమిని చూసి ఆనందించే కళ్లలో మిమ్మల్ని చూసుకోకండి. కానీ వారి విమర్శలను నుంచి ఎదిగండి. అయితే మీ విజయంతో విమర్శకుల ముఖంపై కొట్టినట్టు చేయడం మాత్రం మరిచిపోకండి. అప్పుడు మీ ముఖంపై, జీవితంలోకి వచ్చే నవ్వులే కదా అసలైన గెలుపు. అలా మీ జీవితంలోనే విలన్‌లను కమెడియన్‌లు మార్చేయండి. అప్పుడే నీ జీవితాన్ని నువ్వే మంచి కథగా రాసుకున్న డైరెక్టర్స్ అవుతారు' అంటూ రాసుకొచ్చింది. కాగా మన జీవితంలోని నెగిటివిటి తీసేందుకు చెప్పిన మాటలు పలువురి ఆకట్టుకుంటున్నాయి. మంచి మాటలు చెప్పారంటూ నెటిజన్లు ఆమెను ప్రశంసిస్తుంటే.. మరికొందరెమో ఎవరిని టా÷-గg÷ట్ చేసి ఈ వ్యాఖ్యలు చేశారంటూ కామెంట్స్ చేస్తున్నారు.







# గుడ్‌లక్ జాన్వీ..నయన్ అభినందన !

గుడ్ లక్ జాన్వీ అంటూ దివంగత నటి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్‌కు విషెస్ చెప్పారు నయనతార. ఆమె కథానాయికగా నటించిన 'కొలమావు కోకిల' చిత్రాన్ని హిందీలో 'గుడ్ లక్ జెర్రీ' టైటిల్‌తో రీమేక్ చేశారు. జూలై 29న ఈ చిత్రం డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో విడుదలై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రంలో జాన్వీ నటనకు ప్రేక్షకులే కాకుండా సినీ సెలబ్రిటీలు సైతం ప్రశంసిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను వీక్షించిన నయన్ పలు ఇంటర్వ్యూలో జాన్వీని ప్రశంసించారు. ఈ విషయం తెలుసుకున్న జాన్వీ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో నయన్‌కు థ్యాంక్స్ చెప్పారు. లేడీ సూపర్‌స్టార్ ప్రశంసించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. జాన్వీ మాట్లాడుతూ 'గుడ్ లక్ జాన్వీ' ట్రైలర్‌పై నయన్ గొప్పగా మాట్లాడారని తెలుసుకున్నా. నా నటన గురించి ఆమె నోట వినడం చాలా సంతోషంగా అనిపించింది. అందుకే ఆమెతో స్వయంగా మాట్లాడి కృతజ్ఞతలు తెలపాలని ఆమె ఫోన్ నంబర్ తీసుకుని మెసేజ్ చేశా. వెంటనే ఆమె నుంచి రిప్లై వచ్చింది. 'కెరీర్ బిగినింగ్‌లోనే నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు పోషించినందుకు గర్వపడుతున్నా. 'గుడ్ లక్ జెర్రీ' ట్రైలర్ నాకు చాలా నచ్చింది. కోకిల నా మనసుకు చాలా దగ్గరైన పాత్ర. ప్రేక్షకులకు చక్కని వినోదాన్ని పంచావు. 'గుడ్ లక్ జాన్వీ' అంటూ నయన్ మెసేజ్ చేశారు' అని జాన్వీ కపూర్ ఆనందం వ్యక్తం చేశారు. జాన్వీ నటించిన 'మిలీ' తదితర చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు త్వరలో జాన్వీ టాలీవుడ్‌కి కూడా రాబోతుందనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.



# దూసుకుపోతున్న బుల్లెట్ ట్రైన్

అకాడమీ అవార్డు గెలుచుకున్న ప్రముఖ నటుడు బ్రాడ్ పిట్ మూడు సంవత్సరాల తర్వాత మళ్ళీ వెండితెరపై కనిపించాడు. బ్రాడ్ పిట్ ప్రధానపాత్రలో భారీ అంచనాల నడుమ తెరకెక్కిన 'బుల్లెట్ ట్రైన్' అనే ఈ యాక్షన్ -కామెడీ చిత్రం ఆగష్టు 4న విడుదలైంది. ఈ మూవీలో హీరో కామెడీతో పాటు, ఉత్తేజకరమైన యాక్షన్ సన్నివేశాలు నాన్-స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను తెచ్చిపెట్టాయి. దేశ వ్యాప్తంగా ప్రశంసలందుకుంటున్న ఈ చిత్రం సూపర్‌సోనిక్ స్పీడ్ తో దూసుకుపోతోంది. ది క్యూరియస్ కేస్ ఆఫ్ బెంజమిన్ బటన్, టరాన్టినోస్ ఇన్‌గ్లోరియస్ బాస్టర్డ్స్, మనీబాల్, ఓషన్స్ ,ఓషన్స్ ఎలెవెన్, ట్వెల్వ్ వంటి బ్లాక్ బస్టర్ అవార్డ్ విన్నింగ్ చిత్రాలలో బ్రాడ్ పిట్ నటించాడు. క్వెంటిన్ టరాన్టినో యొక్క వన్స్ అపాన్ ఎ టైమ్‌లో అకాడమీ అవార్డు గెలుచుకున్న ప్రదర్శనలను హాలీవుడ్‌లో లియోనార్డో డికాప్రియో మరియు యాడ్ ఆస్ట్రాత్రో కలిసి అందించాడు. ఇక ఆయన తాజా చిత్రం బు÷-లలెట్ ట్రైన్‌తో మరోసారి అదే మ్యాజిక్‌ను తెరపైకి తీసుకువచ్చాడు. రీసెంట్ గా దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ సినిమా అందర్నీ ఆకట్టుకుంటోంది. డెడ్‌పూల్ 2 దర్శకుడు డేవిడ్ లీచ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం కోటారో ఇసాకా యొక్క బెస్ట్ సెల్లర్ మరియా బీటిల్ ఆధారంగా రూపొందించబడింది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in